Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దిన పత్రిక

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ బుధవారం 01-04-2026 సంపుటి : 1 సంచిక :285 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G) , రిజిష్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్ : 73860 45673

## జులై నాటికి రాష్ట్రవ్యాప్తంగా

# సంజీవని ప్రాజెక్టు అమలు

- మెరుగైన ప్రజారోగ్యం కోసం అందరూ ఉద్యమంలా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.
- సంజీవని ప్రాజెక్టును జులైలోగా రాష్ట్రమంతటా అమలయ్యేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు.



ఏప్రిల్ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వైద్యాధికారులు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రతీ నెలా నాలుగో శనివారం స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్ గ్రామసభలు, హెల్త్ క్యాంప్‌లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్దేశించారు.సంజీవని ప్రాజెక్టుపై ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ పరిధిలోని నారావారి పల్లెలో సమర్ధంగా అమలవుతున్న సంజీవని ప్రాజెక్టును జులైలోగా రాష్ట్రమంతటా అమలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు జరపాలని అధికారులను ఆదేశించారు.

విశాఖ యువతి

## మౌనిక హత్య

**ఒళ్లు గగుర్పొడిచే నిజాలు**

మౌనికను కిరాతకంగా చంపేసి..

రక్తపు వాసన రాకుండా సెంటు కొట్టి..



2లో..

## సహజీవన జంటలకు కుటుంబ హోదా:

**జనగణనపై కేంద్రం**



## అమరావతి చట్టబద్ధత తీర్మానం పనికిరాదు



సోమవారం ఉదయం 'చలో మూలపేట' కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నౌపడ కూడలి వద్ద వైకాపా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రూ.లక్షల కోట్లు అప్పులు చేసి రాజధానిలో ఖర్చు పెడితే ఎప్పటికి పూర్తవుతుందని బొత్స ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.3.50 లక్షల కోట్లు అప్పు తెచ్చి అందులో రూ.వెయ్యి కోట్లయినా పేద ప్రజల కోసం ఖర్చు చేశారా అని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు నిలదీశారు.

## ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !





## ఏపీ, తెలంగాణ

### ఇంటర్ ఫలితాలు ఎప్పుడంటే?

- తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్ ఫలితాలను వీలైనంత త్వరగా విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్ ఫలితాలను వీలైనంత త్వరగా విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఏప్రిల్ రెండో వారం లోగా ఈ ఫలితాలను ప్రకటించే దిశగా రంగం సిద్ధం చేస్తున్నారు. తెలంగాణలో ఇప్పటికే పరీక్షలు పూర్తయి మూల్యాంకనం మొదలు కాగా.. ఏపీలో ప్రధాన పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఈ నేపథ్యంలో మార్చి 21 నుంచి ఏపీలో జవాబుపత్రాల మూల్యాకనం మొదలుకానున్నట్లు ఏపీ ఇంటర్ బోర్డు కార్యదర్శి రంజిత్ బాషా తెలిపారు.

## చివరి ధాన్యం గింజ వరకు కొంటాం



- 8గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు
- కోవూరు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం
- ఎమ్మెల్యే ప్రశాంతితో కలిసి పరిశీలించిన మంత్రి నాదెండ్ల

చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం అమ్మిన ఎనిమిది గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడేలా చూస్తున్నామని మంత్రి అన్నారు. క్షేత్రస్థాయిలోనూ రైతులు.. డబ్బులు వేగంగా పడుతున్నాయని చెప్పడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేకంగా కల్లాలు ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. నెల్లూరు జిల్లా సాగు చాలా ప్రత్యేకమైనదని మంత్రి అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే 40 నుంచి 60 రోజులు ఆలస్యంగా దిగుబడి వచ్చే ప్రాంతమిది అని చెప్పుకొచ్చారు. సోమవారం ఉదయం కోవూరు మండలం ఇనమడుగులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరిశీలించారు.

2లో..





ఎండలు ముదురుతున్నాయి. ఇప్పుడే 40 డిగ్రీలకు చేరువలో ఉన్నాం. రానున్న రెండు నెలలు దారుణంగా ఉండే పరిస్థితులు కానవస్తున్నాయి. వాతావరణశాఖ కూడా ఇదే హెచ్చరిక చేస్తోంది. పశ్చిమాసియా యుద్ధం వల్ల వాతావరణంలో వేడి పెరిగిందని కూడా ఆందోళన వస్తోంది. అయితే ఇది ఎంతవరకు నిజమన్నది పక్కన పెడితే ఎండలు మాత్రం ముదురుతున్నాయి. ఇప్పటికే వేసవి మొదలు కావడంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమైంది. 2030 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటే ప్రమాదం వుందని గణాంకాలు చెబుతున్నాయి. పర్యావరణ విధ్వంసం కూడా దీనికి ప్రధాన కారణం. మనం భూగర్భ జలాలను, నీటి వనరులను కోల్పోవడమే కాదు, ఉన్న నీటిని కూడా విషపూరితం చేస్తున్నామని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా కాపాడలేని పరిస్థితిలో ప్రభుత్వాలున్నాయి. దేశంలో ఏటా 3.77 కోట్ల మంది కలుషిత నీటి వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా వంటి వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారు.

## ఆళ్లకు హైకోర్టులో చుక్కెదురు



**మూడు పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు**

ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో వైసీపీ నేత, మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన మూడు పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని, విజయవాడ ఏసీబీ కోర్టు నుంచి ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు కేసును బదిలీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వైసీపీ నేత పిటిషన్ వేశారు.

# నేడు వీర హనుమాన్ విజయ యాత్ర

- మామిడిపల్లి హనుమాన్ ఆలయం నుంచి శివాజీ చౌక్ వరకు..
- విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో..
- హిందువులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు..

ఆర్మూర్ పట్టణంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నాలుగున్నర గంటలకు వీర హనుమాన్ విజయ యాత్ర ప్రారంభమవుతుందని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, నిర్వాహణ కార్యదర్శి అల్జాపూర్ అక్షయ్ చెప్పారు. ఈ విజయ యాత్ర మామిడిపల్లి నుంచి ప్రారంభమై మామిడిపల్లి చౌరస్తా, కొత్త బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, పాత బస్టాండ్ మీదుగా శివాజీ చౌక్ వరకు సాగుతుందన్నారు. ఈ యాత్రలో వీర హనుమాన్ విగ్రహంతో పాటు శివుడు, అయోధ్యలోని బాల శ్రీరాముడి భారీ విగ్రహాలతో శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ యాత్రలో ఆర్మూర్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. తాము ఇప్పటికే అందరిని కలిసి ఆహ్వానాలు అందజేయడం జరిగిందన్నారు. ప్రతి హిందూ బంధువు సమయాన్ని కేటాయించి యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

# శ్రీకాళహస్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు బడ్జెట్ సమర్పణకు మహాజన సభ

శ్రీకాళహస్తి, మార్చి 31, గాయత్రి వార్తలు: రిపోర్టర్ : మునిరత్నం



శ్రీకాళహస్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9 గంటలకు బడ్జెట్ సమర్పణ నిమిత్తం మహాజన సభ నిర్వహించబడింది. ఈ సమావేశం బ్యాంకు కార్యాలయంలో ఘనంగా జరిగింది. సభలో చైర్మన్ ఖాదర్ బాషా మాట్లాడుతూ, గౌరవ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆశీస్సులతో బ్యాంకు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతూ, లాభాల బాటలో కొనసాగుతోందని తెలిపారు. ఈ విజయానికి సభ్యులు, ఖాతాదారుల సహకారం ముఖ్య కారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఎన్. గోవర్ధన్, పాలకమండలి సభ్యులు మురళి, దొరబాబు, బాబు రెడ్డి, ఆర్మగం, రాంబాబు, అనిల్ కుమార్, శ్రీమతి కవిత, సీఈఓ ధనంజయులు, అకౌంటెంట్ రవి తదితరులు పాల్గొన్నారు. సభకు హాజరైన సభ్యులు, ఖాతాదారులకు సమావేశాన్ని విజయవంతం చేసినందుకు బ్యాంకు యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది.

# మాదకద్రవ్యాల నియంత్రణకు అందరూ సహకరించండి

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్





జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కోరారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం జరిగిన మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ కె. కిషోర్ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత జిల్లాగా ఏలూరు జిల్లాను రూపొందించేందుకు సమాజంలోని ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు జోలికి వెళితే భవిష్యత్తు అంధకారమవుతుందని యువతలో అవగాహన కలిగించి, యువత మాదకద్రవ్యాల జోలికి పోకుండా చూడాలన్నారు. మాదకద్రవ్యాలతో పట్టుబడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు కలిగివున్నా , వినియోగం, రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. ఉద్యోగాలకు, పాస్పోర్ట్ ల జారీ కి అనర్హతతో పాటు శాశ్వత క్రిమినల్ రికార్డు కలిగి ఉంటారని, భవిష్యత్తు మొత్తం అంధకారం అవుతుందన్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై దుష్ప్రభావాలు, దుష్పరిణామాలపై ప్రజలకు ముఖ్యంగా యువతకు అవగాహన కలిగించేందుకు ప్రతీ పాఠశాల, కాలేజీలలోనూ పోస్టర్ల ద్వారా తెలియజేయడంతోపాటు సమావేశాలు ఏర్పాటుచేసి అవగాహన కలిగించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కె. ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో ఎవరైనా మాదకద్రవ్యాలు సేవిస్తున్నా, పెడ్లర్స్ సమాచారాన్ని 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారికి డి అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స అందించడం జరుగుతుందన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ విచ్చలవిడిగా విక్రయించకుండా ఔషధ దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. ట్రైన్లు, రవాణా వాహనాల ద్వారా గంజాయి, డ్రగ్స్ రవాణాని నియంత్రించేందుకు వజ్రప్రహార్ ద్వారా నిఘా చర్యలు తీసుకుని, మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఏఎస్పీ నక్కా సూర్యచంద్ర రావు, ఉప రవాణా కమీషనర్ కరీమ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. శోభా, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, ఎక్సయిజ్ శాఖ సూపరింటెండెంటు ఏ.ఆవులయ్య , విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, సాంఘిక సంక్షేమాధికారి విశ్వమోహన్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ రమేష్, ఐసిసిఎస్ పీడీ శారద, బాలల సంరక్షణాధికారి సూర్యచక్రవేణి, ఈగిల్ టీమ్ ఇంచార్చి బి. ఉదయభాస్కర్, సంబంధిత

# ఆహార కల్తీ నియంత్రణ సరికొత్త వ్యవస్థ

పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు.

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

## కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్
## ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
## వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ
## అండగా ఉంటామని హామీ

హైదరాబాద్,: సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని అన్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో కేటీఆర్ సహా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పర్యటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ కబ్జా బాధితులను పరామర్శించారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతుందని బాధితులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వట్టనాగులపల్లిలో సతీశ్ షా కుటుంబం 60 ఏళ్లుగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రూ.1400 కోట్ల విలువ చేసే భూమిపై పొంగులేటి కన్ను పడిందని పేర్కొన్నారు. స్థలం ఇచ్చే ఉద్దేశం లేదని షా కుటుంబం తెలిపిందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డులో మీ ల్యాండ్ పోయిందని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఓ అక్రమార్కున్ని అడ్డం పెట్టుకుని 27 ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జేసీబీలతో వచ్చి గోశాలను కూల్చేశారని.. కాంపౌండ్ వాల్ కూలగొట్టారని అన్నారు. సతీశ్ షాను ఇక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించారని తెలిపారు. అజీబుల్లా ఖాన్ అనే సిన్సియర్ అధికారి వీరికి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. తెల్లారే ఆ నిజాయితీ పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేశారని చెప్పారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని వట్టినాగులపల్లి బాధితుడు సతీశ్ షా తెలిపారు. 1968 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పొంగులేటి హర్ష రెడ్డి వచ్చి రోడ్డుకు స్థలం ఇవ్వాలని అడిగాడని చెప్పారు. అందుకు నిరాకరించడంతో కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రెడ్డి వచ్చారని తెలిపారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా మా భూమి సర్వే చేయించాడని అన్నారు. సర్వే నోటీసులను హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొన్నారు. మా మనుషులపై దాడులు చేసి గూండాలు బెదిరించారని తెలిపారు. హైకోర్టుకు వెళ్తే పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు.దీపావళి పండుగ తర్వాత నుంచి చాలా ఆందోళనగా ఉన్నామని వట్టినాగులపల్లి బాధితురాలు పల్లవి షా తెలిపారు. మా భూమి ఇవ్వాలని పొంగులేటి మనుషులు కోరినా నిరాకరించామని పేర్కొన్నారు. మేం 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. మాకు వేరే జాగా వద్దని అన్నామని చెప్పారు. అక్కడిస్తాం.. ఇక్కడిస్తామని మమ్మల్ని ఎంతో మభ్యపెట్టారని తెలిపారు. కిలోమీటర్ ఉన్న కాంపౌండ్ వాల్‌ను రాత్రికి రాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని తెలిపారు. అదే రోజు రాత్రి 70 మంది గూండాలు వచ్చి మా గార్డులను బంధించారని వాపోయారు. మొబైల్స్ గుంజుకున్నారు..

తెల్లవారుజాము వరకు నిర్బంధించారని తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే నరికిపారేస్తామని బెదిరించారని అన్నారు. మాకు అండగా ఉన్న పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేయించారని తెలిపారు. మాకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు.

# ఆళ్లకు హైకోర్టులో చుక్కెదురు

మొదటి పేజీ తరువాయి

అలాగే ఈ కేసులో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆళ్ల రామకృష్ణారెడ్డి వేర్వేరుగా వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఈ పిటిషన్లంటిపై హైకోర్టులో విచారణ జరిగింది. దాదాపు మూడు వారాల పాటు విచారణ జరిగిన అనంతరం సోమవారం ఉదయం ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ వ్యాజ్యాలన్నింటినీ కొట్టివేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. అలాగే వ్యాజ్యాల విచారణార్హతపై కూడా ఇటీవల న్యాయస్థానంలో వాదనలు ముగిశాయి. ప్రభుత్వం తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఇలాంటి పిటిషన్లకు విచారణార్హత లేదని సిద్ధార్థ లూథ్రా వాదించారు. ఈ వాదనలు

# విశాఖ యువతి మౌనిక హత్య

మొదటి పేజీ తరువాయి

విశాఖపట్నం: విశాఖపట్నంలోని ఎల్.వి.నగర్‌లో దారుణ హత్యకు గురైన యువతి మౌనిక (29) కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ప్రాథమిక విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. లాక్‌డౌన్ సమయంలో నిందితుడు చింతాడ రవీంద్రకు డేటింగ్ యాప్‌లో మౌనిక పరిచయమైనట్లు తెలిసింది. ఆమెకు రూ.3.50లక్షల ఇచ్చినట్లు రవీంద్ర తెలిపాడు. డబ్బు కోసం మౌనిక వేధించేదని.. హింస భరించలేకే ఆమెను హతమార్చినట్లు పోలీసులకు చెప్పాడు.

ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఎల్.వి.నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌కు మౌనికను రవీంద్ర పిలిచాడు. అక్కడికి వచ్చిన కాసేపటికే వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆ తర్వాత ఆమెను రవీంద్ర కిరాతకంగా హతమార్చాడు. హత్యకు ముందే గాజువాకలో కత్తులు కొనుగోలు చేశాడు. మౌనికను చంపిన తర్వాత రక్తపు మరకలు కడిగేశాడు. రక్తపు వాసన రాకుండా ఇంట్లో సెంటు కొట్టాడు. శరీర భాగాలను ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో పెట్టాడు. తల, ఆమె ఫోన్‌ను దారపాలెం తోటల్లో తగులబెట్టాడు. అనంతరం స్నేహితుడికి ఫోన్ చేసి హత్య విషయాన్ని చెప్పాడు. స్నేహితుడు హెచ్చరించడంతో గాజువాక పోలీసులకు రవీంద్ర లొంగిపోయాడు.

# నర్సీపట్నంలో గ్యాస్ కొరత లేకుండా చర్యలు:

మొదటి పేజీ తరువాయి

వంట గ్యాస్ కోసం ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. జాతరకు సుమారు లక్ష మంది భక్తులు తరలివస్తారని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో గ్యాస్ అవసరాలను గుర్తించి అధికారులతో మాట్లాడి ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటివరకు సుమారు 4,500 గ్యాస్ సిలిండర్లను నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోకి తెప్పించామని, మరో 2,000 సిలిండర్లు కూడా అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలకు గ్యాస్ సమస్య ఉంటే నేరుగా ఎమ్మార్వోను కలిసి పరిష్కరించుకోవచ్చన్నారు.

# సహజీవన జంటలకు కుటుంబ హోదా:

మొదటి పేజీ తరువాయి

దేశవ్యాప్తంగా జనగణనకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలకు సంబంధించిన నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. ఈసారి సహజీవన జంటలకు కుటుంబ హోదా ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. చాలాకాలంగా కలిసి ఉంటున్న వారిని ఇకపై ఒకే కుటుంబంగా గుర్తించాలని నిర్ణయం తీసుకున్నట్లు తాజాగా వెల్లడించింది. ఈమేరకు జనగణన ప్రక్రియ వివరాలను రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ సోమవారం మీడియాకు వివరించారు.

ప్రస్తుతం జరగనుంది 16వ జనగణన. ఈ ప్రక్రియ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానుంది. రెండు దశల్లో దీన్ని చేపట్టనున్నారు. తొలిదశలో భాగంగా గృహ గణన చేపట్టనున్నారు. మొబైల్ యాప్ ద్వారా అధికారులు ఇంటింటికీ వెళ్లి ఇళ్ల వివరాలు సేకరించనున్నారు. రెండో దశలో జనాభా లెక్కల సేకరణ ఉంటుంది. దీన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించనున్నారు. ఇంతకుముందెప్పుడూ లేనివిధంగా తొలిసారి స్వయంగా వివరాల నమోదుకు కేంద్రం ఈసారి అవకాశం కల్పించింది. జనగణన కోసం 33 ప్రశ్నలతో ఓ ప్రశ్నావళిని రూపొందించారు.

ఇంటి యజమాని, అతని వ్యక్తిగత వివరాలు, కులం, కమ్యూనిటీకి సంబంధించిన వివరాలను ఇవ్వాల్సిఉంటుంది. ఇంట్లో ఉండే వారి సంఖ్య, వారి వయసు వంటి వివరాలను అధికారులు నమోదు చేసుకుంటారు. ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీపు, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వాడకం, వంటగది సౌకర్యాలు, వంటకు వినియోగించే ఇంధనం వివరాలు సేకరిస్తారు. ఈ వివరాలన్నీ అత్యంత గోప్యంగా ఉంటాయని రిజిస్ట్రార్ జనరల్ వెల్లడించారు. మన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణనకు ఆటంకం ఏర్పడింది.

# ఏపీ, తెలంగాణ ఇంటర్ ఫలితాలు ఎప్పుడంటే?

మొదటి పేజీ తరువాయి

గేట్ ఫలితాలు విడుదల.. రిజల్ట్స్ కోసం క్లిక్ చేయండి

మరోవైపు, తెలంగాణలో ఇంటర్ పరీక్షా ఫలితాలను ఏప్రిల్ 10లోపు విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వీలైతే ఏప్రిల్ 6నే విడుదల చేయాలని భావిస్తున్నారు. జూన్ 1 నుంచి జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం కానున్నందున ఫెయిలైన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించి మే 31 నాటికి ఫలితాలు ఇవ్వాలని నిర్దేశించుకున్నారు. ఈ క్రమంలో మార్చి 15 నుంచే మూల్యాంకనం ప్రక్రియను ప్రారంభించి ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.

# చివరి ధాన్యం గింజ వరకు కొంటాం

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా పొలాల్లో రైతులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లా నుంచి ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదని, రైతులను నిలువునా ముంచేశారని ఆయన ఆరోపించారు. ధాన్యం కొనుగోలు విషయంలో అప్పటి నేతలు గోల్‌మాల్ చేసి రూ.82 కోట్ల మేర అవినీతి చేశారని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు వ్యవస్థలను క్రమబద్ధీకరిస్తున్నామని చెప్పారు. గత ఏడాది 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ఈ ఏడాది

# వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకర్లు సాధించాలి

- కౌలు రైతులకు నిర్దేశించిన మేర రుణాలు అందించాలి
- పిఎం సూర్యఘర్ ముప్తి బిజిలి యోజన పథకంలో 10 వేల యూనిట్లకు రుణాలు అందించాలి
- బ్యాంకర్ల సమావేశంలో వార్షిక రుణా ప్రణాళిక లక్ష్యాల సాధనపై అధికారులు, బ్యాంకర్లతో కలెక్టర్ కె. వెట్రిసెల్వి సమీక్ష




గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

జిల్లాలో వార్షిక రుణ ప్రణాళికను ననుసరించి ప్రాధాన్యత రంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి బ్యాంకర్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం బ్యాంకర్ల సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో 2025- 26 వార్షిక రుణ ప్రణాళిక అమలులో నిర్దేశించిన లక్ష్యాల సాధనపై అధికారులు, బ్యాంకర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ప్రాధాన్యతా రంగాలలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు పంట రుణాలుగా 13 వేల 965 కోట్ల రూపాయలు రుణ లక్ష్యాలను సాధించారని, అదేసమయంలో ప్రాధాన్యతా రంగాలలో 48. 17 శాతం మాత్రమే లక్ష్యసాధనపై కలెక్టర్ స్పందిస్తూ ప్రాధాన్యతా రంగాలలో నూరుశాతం లక్ష్యసాధన జరిగేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు 2025 2025 ఖరీఫ్, రబీ కాలానికి 375 కోట్ల రూపాయలు రుణాలు అందించాల్సి ఉండగా 124 కోట్ల రూపాయలు మాత్రమే అందించారన్నారు. ఎంఎస్ఎంఈ లక్ష్యాలలో 65. 84 శాతం మాత్రమే లక్ష్య సాధన చేశారన్నారు. కౌలు రైతులకు, ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటుకు కూడా నిర్దేశించిన లక్ష్యాల మేర రుణాలు అందించాలన్నారు. ప్రభుత్వ పథకాలకు నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకర్లు సాధించేలా బ్యాంకర్లతో సమన్వయము చేసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 13 వేల 659 స్వయం సహాయక సంఘాలకు 1364. 34 కోట్ల రూపాయలు రుణాలుగా అందించారన్నారు. పట్టణ ప్రాంతాలలోని 2050 స్వయం సహాయక సంఘాలకు 242. 34 కోట్ల రూపాయలు రుణాలుగా అందించారన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ముప్తి బిజిలి యోజన పథకంలో 5620 దరఖాస్తులు మాత్రమే మంజూరు చేయడంపై కలెక్టర్ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 10 వేల యూనిట్లు ఏర్పాటుచేయాలని లక్ష్యాలను నిర్దేశించిందని, లక్ష్యాలు సాధించే దిశగా బ్యాంకర్ల వద్ద పెండింగ్ ఉన్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. జిలాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు 219 దరఖాస్తులు అందగా, 31 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, 22 దరఖాస్తులు తిరస్కరించడం జరిగిందన్నారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి కారణాలు తెలుసుకుని, పరిష్కరించదగిన అంశాలు ఉంటె పరిశీలించాలని బ్యాంకర్లకు కలెక్టర్ సూచించారు. చిన్న వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి ఉద్దేశించిన పిఎం స్వనిది పథకంలో 1325 దరఖాస్తులు బ్యాంకర్ల వద్ద పెండింగ్ ఉండడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వాటిని వెంటనే పరిశీలించి నిబంధనల మేరకు ఉన్న దరఖాస్తులకు రుణాలు అందించాలన్నారు. పిఎంఈజిపి పెండింగ్ లో ఉన్న 44 దరఖాస్తులు, పిఎం విశ్వకర్మ పథకంలో పెండింగ్ లో ఉన్న 166 దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు ఎంతో అనువైన పరిస్థితులు ఉన్నాయని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. పాడి పశువులకు రుణాలు అందించే సమయంలో పశువుల భీమా పథకాలపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ సత్యనారాయణ రెడ్డి, ,ఆర్బీఐ ఈఎల్ డియు డి. ఎలమంద, నాబార్డ్ ఏజీఎం అనిల్ కాంత్, ఎల్డిఎం నీలాద్రి, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాష, ఉద్యానవనాలు శాఖాధికారి సాజా నాయక్, బిసి కార్పొరేషన్ ఈడి పుష్పలత, డిఆర్డిఏ ఏపిఎం భూషణం, మెప్మా పీడీ ఎం. రాజబాబు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా 2026-27 పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ బుక్ లెట్ ను కలెక్టర్ విడుదల చేశారు.

# జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- రహదారి ప్రమాదాల కారణంగా ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదు
- జాతీయ రహదారిపై ఆక్రమణలు, అనధికార కట్టడాలు తొలగించాలి
- బస్సులు వంటి భారీ వాహనాల ఫిట్నెస్ పరిశీలించాలి
- బస్సులలో అగ్నిప్రమాదాల నివారణకు భద్రతా ఏర్పాట్లు ఉండాలి
- జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ, దెందులూరు ఎమ్మెల్యే తో కలిసి అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్ష

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

జాతీయ రహదారిపై ప్రమాదాలు అధికంగా సంభవించే (బ్లాక్ స్పాట్స్) ప్రదేశాలలో ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం రహదారి భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ లతో కలిసి రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రహదారి ప్రమాదాల కారణంగా జిల్లాలో ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ వాహనం ఫిట్నెస్ తో ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన డ్రైవర్ మాత్రమే వాహనం నడిపేలా చూడాలని, డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపకుండా జాతీయ రహదారిపై పటిష్టమైన నిఘా పెట్టాలన్నారు. జాతీయ రహదారిపై మితిమీరిన వేగంతో వెళ్లే వాహనాలను గుర్తించి వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు, డ్రైవర్, యజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. బస్సులలో అగ్నిప్రమాద నివారణకు భద్రతా ఏర్పాట్లు ఉండేలా పరిశీలించాలన్నారు.. వాహనదారులు హెల్మెట్ వాడకపోవడం, సెల్ఫోన్లు ఉపయోగిస్తూ డ్రైవ్ చేయడం, త్రిబుల్ రైడింగు, రాంగు రూటు డ్రైవింగు, రోడ్ల మలుపు ప్రాంతాలలో ఎక్కువగా ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టు కుంటున్నారని వీటి నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. చిన్నతనం నుండే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించాలని, ముఖ్యంగా పాఠశాల, కళాశాలలు విద్యార్థినీ, విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని అన్నారు. వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా అధిక వెలుగు కలిగిన ఎల్ఈడి లైట్లు వినియోగం కారణంగా ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బంది కలిగి ప్రమాదాలు జరుగుతున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా అధిక వెలుగు ప్రసరించే ఎల్ఈడి లైట్లు వినియోగించే వారిపై కేసులు నమోదుచేయడంతోపాటు వాటిని అమర్చే షాపు యజమానులపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు.






జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె. ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై అనధికార కట్టడాలు, ఆక్రమణల ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాటిని గుర్తించి వెంటనే తొలగించాలన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు బస్సులు, లారీలు వంటి భారీ వాహనాలు ఫిట్నెస్ ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఫిట్నెస్ లేని వాహనాలు నడిపితే వాహనం సీజ్ చేయడంతోపాటు, వాహన యజమానిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ప్రమాద సమయంలో క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు 108 వాహనాలు సిద్ధంగా ఉండేలా 108 వాహనాల సిబ్బందితో సమన్వయము చేసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్రాలకు అధిక శబ్దాలతో కూడిన సైలెన్సర్లు వినియోగించేవారిపై కేసులు నమోదు చేయాలన్నారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో జాతీయ రహదారి అలైన్మెంట్ సక్రమంగా లేని కారణంగా కొన్ని చోట్ల రోడ్డు కృంగిపోయి ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని, రహదారి నిర్మాణాన్ని సరిచేయాలని కోరారు. దెందులూరు నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారిలో దెందులూరు-గుండుగొలను మధ్య సర్వీస్ రోడ్డు ఏర్పాటుచేయలేదని, సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారిలో డివైడర్లలో చెట్లు నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత రహదారి నిర్వహణ సంస్థదని , కానీ నిర్వహణ పనులు చేపట్టడంలేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ రహదారి నిర్వహణ పనులను సంబంధిత కాంట్రాక్టు ఏజెన్సీ వారి పట్టించుకోవడంలేదని , జాతీయ రహదారి నిర్వహణ పనులు సక్రమంగా సాగేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఉప రవాణా కమీషనర్ కరీమ్ మాట్లాడుతూ . రహదారి ప్రమాదం కారణంగా క్షతగాత్రులకు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన ఆసుపత్రులలో రూ. 1. 50 ల వరకు కాష్ లెస్ ట్రీట్మెంట్ కు అవకాశం ఉందని,ప్రమాదం జరిగిన 72 గంటలలోగా తెలియజేయాల్సి ఉంటుందని చెప్పారు.సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ రమేష్, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్, డిఎంహెచ్ఓ డా. శోభా, డిసిహెచ్ఎస్ డా. పాల్ సతీష్, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, జిల్లా పరిశ్రమల శాఖాధికారి వెంకటరావు, జాతీయ రహదారి సంస్థ అధికారులు, పోలీసు, రవాణా శాఖాధికారులు పాల్గొన్నారు.

# మునిశేఖర్‌కు బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పదవి ప్రముఖుల అభినందనలు

శ్రీకాళహస్తి, మార్చి 31, గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్





శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ 2026-2027 సంవత్సరానికి నిర్వహించిన ఎన్నికల్లో ప్రముఖ న్యాయవాది అరికింబేడు మునిశేఖర్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.తుడా చైర్మన్ మరియు టీటీడీ బోర్డు సభ్యుడు డాలర్స్ దివాకర్ రెడ్డి, బీజేపీ పార్టీ ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ తదితరులు మునిశేఖర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాద వృత్తిలో ఆయనకు ఉన్న అనుభవం, సేవా దృక్పథం బార్ అసోసియేషన్ అభివృద్ధికిదోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ ఎన్నికలో విజయం సాధించడం పట్ల మునిశేఖర్ ఆనందం వ్యక్తం చేస్తూ, బార్ అసోసియేషన్ సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు.

# రూ.2.5 కోట్ల బిటి రోడ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయకర్

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



ల్తూరు మండలంలోని శేరిపాలెం గ్రామంలో రూ.2.5 కోట్ల వ్యయంతో నిర్మించిన బిటి రోడ్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ,నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణంలో భాగంగా మండా వారి గరువు ప్రాంతంలో 3 కిలోమీటర్ల మేరకు రూ.1.25 కోట్లతో, అలాగే పాలకమ్మ చెరువు నుండి నవుదూరు గరువు వరకు మరో 3 కిలోమీటర్ల మేరకు రూ.1.25 కోట్లతో బిటి రోడ్ నిర్మాణం చేపట్టబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారులు కీలకమని తెలిపారు. మంచి రహదారులు ఉండటం వల్ల ప్రజల రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు రైతులు తమ పంటలను సులభంగా మార్కెట్‌కు తరలించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రహదారులను కూటమి ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుని అభివృద్ధి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, జనసేన, టిడిపి, బిజేపి నాయకులు, కార్యకర్తలు మరియు జనసైనికులు పాల్గొన్నారు.

# ప్రతి బూత్‌లో ఓటర్ల జాబితా పరిశీలన ప్రారంభించాలి: కోలా ఆనంద్ పిలుపు

శ్రీకాళహస్తి, మార్చి31,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్



ఓటర్ల జాబితా "ప్రత్యేక సమగ్ర సర్వే" నేపథ్యంలో తిరుపతి జిల్లా స్థాయి కార్యశాల నాయుడుపేటలోని శ్రీకాళహస్తి రోడ్డులో ఉన్న శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ మాట్లాడుతూ రేపటి నుంచే ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల జాబితా పరిశీలన చేపట్టాలని సూచించారు. ఓటర్ల జాబితాలోని తప్పులను సవరించడంలో బీజేపీ కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఓటరు జాబితా సవరణలో పారదర్శకత పెంచేందుకు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలుగా నియమించి అధికారులతో సమన్వయం చేసుకుంటూ తప్పుల్లేని జాబితాను రూపొందించాలన్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను కూడా కార్యకర్తలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మట్టా ప్రసాద్, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యుడు వరప్రసాద్, రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, మోర్చా అధ్యక్షులు, మండల అధ్యక్షులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# వైఎస్ జగన్ ను కలిసిన ఎంపిటిసి

- కలరాయినిగూడెం పంచాయతీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ ఓబుల్నేని ప్రసన్నకుమారి

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ని కలరాయినిగూడెం పంచాయతీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ ఓబుల్నేని ప్రసన్నకుమారి మంగళవారం పుష్పగుచ్ఛం అందజేసి,మర్యాదపూర్వక కలిశారు.లింగపాలెం మండలంలోని సమస్యలను లను జగన్మోహన్ రెడ్డికి వివరించారు.పార్టీ అభివృద్ధికి ఎంపీటీసీ చేస్తున్న సేవలను వివరించారు.అధికారం లేకపోయినా పార్టీ నాయకులు కార్యకర్తలు చెక్కుచెదరలేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగురవేస్తామని ఆమె తెలిపారు.పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని జగన్ హామీ ఇచ్చారు.

# ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల భారీ ధర్నా

**- రూ. 26 వేల కనీస వేతనం కోసం నినాదాలు.. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిక**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్




అంగన్‌వాడీలకు నెలకు రూ. 26,000 కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరు జిల్లా కుక్కునూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అంగన్‌వాడీలకు నెలకు రూ. 26,000 కనీస వేతనం వెంటనే అమలు చేయాలి.కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి. అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి.

పని ఒత్తిడిని తగ్గించి, ఉద్యోగ భద్రత కల్పించాలి.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, ఏళ్ల తరబడి అంగన్‌వాడీలు చాలిచాలని వేతనాలతో సేవలు అందిస్తున్నారని, ప్రస్తుత ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నాయని, తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐసీడీఎస్ అధికారులకు అందజేశారు.

# ఎస్టీల భూములకు రక్షణ కల్పించండి

తొట్టంబేడు, మార్చి31,గాయత్రి వార్తలు: రిపోర్టర్ : మునిరత్నం




మండలంలోని పూడి గ్రామంలో ఎస్టీల భూములకు పెత్తందారుల నుంచి రక్షణ కల్పించాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్ డిమాండ్ చేశారు. ఆక్రమిత భూమిలో ఎస్టీలు ఏపీ గిరిజన సంఘం, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం, కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘంతో కలిసి మంగళవారం కొబ్బరి చెట్లు నాటారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న 30 గిరిజన (ఎరుకల) కుటుంబాలకు 1987లో డీకేటీ పట్టాలు ఆ క్రమలోనే కంపా రాజమ్మకు 2.78 ఎకరాలు భూమి ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఆమె మరణానంతరం రెండవ కుమారుడు కంపా గోపాల్ 38 ఏళ్ళుగా ఆ భూమిలో వరి, మినుములు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. అయితే అదే గ్రామానికి చెందిన పముజుల నరసింహులు నాయుడు, పముజుల మాధవుల నాయుడు, జి.రత్నయ్య నాయుడులు గోపాల్ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారని మండిపడ్డారు. 2023లో రెవెన్యూబి పోలీసులు సమక్షంలో భూములను సర్వే చేసి గిరిజనులకు స్వాధీనపరిచినప్పటికీ భూమిలోకి రానివ్వకుండా పెత్తందారులు అడ్డుకుంటున్నారని వాపోయారు. ప్రతిఘటనలో భాగంగా ఆక్రమిత భూమిలో కొబ్బరి చెట్లు నాటినట్లు వివరించారు. రెవెన్యూ అధికారులు గోపాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి ప్రసాద్, కెవిపిఎస్ నాయకులు గంధం మణి, అంగేరి పుల్లయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# పదవీవిరమణ పోలీసు అధికారులకు ఘనంగా వీడ్కోలు



గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

సుదీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖలో నిరుపమాన సేవలు అందించి మంగళవారం పదవీ విరమణ చేసిన ఎస్సై వై.డి. కృపావరం, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస రావులను జిల్లా పోలీస్ శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది.

ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, జిల్లా పోలీస్ ప్రధాన కార్యా లయం లో పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని, పదవీ విరమణ పొందుతున్న ఎస్సై హెడ్ కానిస్టేబుల్ లను ఘనంగా సన్మానించారు. వై.డి. కృపా వరం 39 సం.ముల తన సుదీర్ఘ సర్వీసులో వివిధ హోదాల్లో పనిచేసి, శాఖా పరంగా మరియు ప్రజల పరంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారని పోలీసు అధికారులు తెలిపారు.హెడ్ కానిస్టేబుల్ బి శ్రీనివాసరావు వాలంటరీ రిటైర్మెంట్ పొందిన నేపథ్యంలో లో ఆయన అందించిన సేవలను కొనియాడుతూ జిల్లా పోలీస్ యంత్రాంగం, సహచర అధికారులు ఆయనను దుశ్శాలువా, జ్ఞాపిక తో సత్కరించారు. పదవీ విరమణ అనంతరం వారిశేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా గడపాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ జీ ముని రాజు గ, ఏ ఆర్ డీఎస్పీ చంద్ర శేఖర్ , ఆర్ ఐ పవన్ కుమార్, ఏలూరు జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్ నాగేశ్వరరావు, జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందుతున్న పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా ఆర్థికాభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులను సమర్థవంతంగా వినియోగించాలి

**- భీమవరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు ఇతర రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా తలసరి ఆదాయం పెంపు సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులకు సూచించారు.భీమవరంలోని జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో రాష్ట్ర బడ్జెట్ 2026-27 కేటాయింపులపై మంగళవారం “బడ్జెట్ ఔట్‌రీచ్” సమీక్ష సమావేశం ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులతో నిర్వహించబడింది. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణ, రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలో రాష్ట్రంలో శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు, ఆదాయం-వ్యయాలు మరియు ఇతర ఆర్థిక అంశాలపై జిల్లా కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం, ఆక్వా రంగాలు ప్రధాన ఆదాయ వనరులని పేర్కొన్నారు. అయితే వీటికి పరిమితం కాకుండా ఇతర రంగాల విస్తరణపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఆక్వా సాగులో రొయ్యలకు వైరస్ సోకినప్పుడు రైతులు సంబంధిత అధికారులను



సంప్రదించకుండా ఎరువుల డీలర్ల సూచనలతో మందులు వాడటం వల్ల నష్టపోతున్నారని తెలిపారు. రైతులకు సరైన అవగాహన కల్పించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026--27 బడ్జెట్ “స్వర్ణాంధ్ర విజన్ 2047” లక్ష్య సాధనకు కీలకమని పేర్కొన్నారు. మండల, నియోజకవర్గ స్థాయి అధికారులకు బడ్జెట్ అంచనాలపై స్పష్టత ఉండాలని, ముందస్తు ప్రణాళికలతో ఖర్చులను నిర్ణయించాలని సూచించారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలను ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేయాలని తెలిపారు. ఆక్వా రంగం, ముఖ్యంగా చేపలు మరియు రొయ్యల ఉత్పత్తి, జిల్లా ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుందని, ఉద్యానవన పంటలు లాభసాటిగా మారుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాను రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి అధికారి కృషి చేయాలని పిలుపునిచ్చారు.రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047 లక్ష్యాలతో అనుసంధానమైన గ్రామీణ ఉపాధి కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పని దినాలు కల్పించే విధంగా పనులను గుర్తించి అమలు చేయాలని, చేపట్టిన పనులు నాణ్యతతో చిరస్థాయిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాను ఆర్థికంగా బలోపేతం చేయడానికి పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పర్యాటక అభివృద్ధి ద్వారా ఆదాయం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ 2026--27లో “సూపర్ సిక్స్” పథకాలైన ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం 2.0, స్త్రీ శక్తి, ఆటో డ్రైవర్ల సేవలో, మత్స్యకార భరోసా వంటి పథకాలకు ప్రాధాన్యత కల్పించబడిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, సిపిఓ కె.శివ పార్వతి, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, డ్వామా పీడీ డా.కే.సి.హెచ్. అప్పారావు, డిపిఓ ఎం.రామనాథరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఏవి సూరిబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.అరుణ కుమారి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పుష్ప రాణి, ఐసీడీఎస్ పీడీ డి.లక్ష్మి, డిఎస్ఓ ఎన్.సరోజ, గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్.వెంకటేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ కే.రామచంద్రారెడ్డి,పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

# రామాలయం పై ఎమ్మెల్యే వైఖరిని అడ్డుకోండి

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

ఆకివీడు పెదపేటలో సామరస్య పరిష్కారాన్ని కోరుకుంటుంటే అక్రమ గృహ నిర్బంధాలు చేయడం అప్రజాస్వామికమని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. క్రాంతిబాబు విమర్శించారు. ఆకివీడు పెదపేటలో జరుగుతున్న వివాదంపై నిజనిర్ధారణకు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి పర్యటన నిమిత్తం కేవీపీఎస్ బృందం ఆకివీడు పెదపేటలో పర్యటనకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు ను ఆయన స్వగృహంలో 5గం.లకు పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పాలకొల్లులో మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ పట్టణ సీఐ ఆదేశాలు మేరకు గృహ నిర్బంధం చేసి నోటీసులు ఇచ్చారు. జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ కు కూడా అర్ధరాత్రి నోటీసులు ఇచ్చినా ఎక్కడికీ వెళ్లకుండా పలుసార్లు పహారా కాశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. క్రాంతిబాబు మాట్లాడుతూ ఆకివీడు పెదపేటలో వివాదంపై సామరస్య పరిష్కారాన్ని కేవీపీఎస్ కోరుకుంటుందన్నారు. ఇరువర్గాల నుంచి మతాన్ని రెచ్చగొట్టే వైఖరిని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఒక వర్గానికి ఎమ్మెల్యే నాయకత్వం వహించడం రాజ్యంగా విరుద్ధమన్నారు. ఎమ్మెల్యే వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు కూడా విస్మయం చెందుతున్నారని మత ఘర్షణలకు తావిచ్చేలా ఉన్న ఎమ్మెల్యే వైఖరిని మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేనంతగా కుల, మతాల ఘర్షణలు సృష్టించడం సబబు కాదన్నారు. ఎంపీ గా ఉన్నప్పుడు 5ఏళ్ళు నియోజకవర్గంలో కనబడని రఘురాముడు ఎమ్మెల్యేగా ఉన్న 2ఏళ్ళలోనే ఇంతటి ఘర్షణలు సృష్టిస్తున్నారంటే మరో మూడేళ్లు దేశంలోనే ఉండి నియోజకవర్గాన్ని ఇంకెంత భ్రష్టుపట్టిస్తారని విమర్శించారు. హిందూత్వ వాదిగా చెప్పుకునే ఎమ్మెల్యే అభివృద్ధి పేరుతో తాను కూల్చిన ఇళ్లన్నీ హిందువులవే అనే విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేపై వచ్చే వ్యక్తిగత ఆర్థిక ఆరోపణలను, వ్యతిరేకతను, ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పక్కదారి పట్టించడానికేనా ఈ చర్యలు అంటూ అనుమానం వ్యక్తం చేశారు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించాలని అసలు పెదపేటలో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి మాత్రమే కేవీపీఎస్ బృందం పర్యటించాలనుకున్నామని కానీ ప్రభుత్వం



అక్రమ గృహ నిర్భంధాలకు పాల్పడటం అన్యాయమన్నారు. అప్రజాస్వామికంగా కొన్ని హక్కులను కాలరాసేలా అధికారుల వ్యవహారశైలి ఉందని మండిపడ్డారు. ఇదొక సున్నితమైన అంశమని భావిస్తే ఈ ఘటనపై ఎమ్మెల్యే వైఖరిని నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే తీరు వలనే ఆకివీడు పెదపేటలో వివాదం రాష్ట్ర వ్యాప్త వివాదంగా మారిందని తెలిపారు. ఇప్పటికీ దళితుల అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయని, నిర్బంధాన్ని తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పోలీసులు ఏకపక్షంగా కాకుండా ఇరువర్గాలను సమన్వయం చేసుకుని ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని కోరారు.

# అంగన్‌వాడీలకు ఎండాకాలం సెలవులు ఇవ్వాలి

**- కుక్కునూరు ప్రాజెక్టు కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ధర్నా**

**- సిఐటియు జిల్లా నేతల మడవి దుర్గారావు,యర్నం సాయికిరణ్**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెలంతా సెలవులు ప్రకటించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మడవి దుర్గారావు, జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అంగన్వాడీలకు మే నెల మొత్తం సెలవులు ఇవ్వాలని కుక్కునూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించి, సిడిపిఓ



అనంతలక్ష్మి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు దుర్గారావు, సాయికిరణ్ మాట్లాడుతూ, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు తీవ్రమైన ఎండల వల్ల ఇబ్బందులు పడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ-స్కూల్ పిల్లలు అధిక ఉష్ణోగ్రతల కారణంగా హాజరు కావడం కష్టమవుతోందన్నారు. సిబ్బంది కూడా మండుతున్న ఎండల్లో విధులు నిర్వహించడం ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 1.4 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, దాదాపు 50 లక్షల మందికి సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లల ఆరోగ్యం, సిబ్బంది సంక్షేమం దృష్ట్యా గర్భిణి బాలింతలకు టెక్ హోంరేషన్ ఇచ్చి,అంగన్వాడీలకు మే నెలలో పూర్తిగా సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమాలు అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి సువ్వేటి లత, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, కారం వెంకట్రావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్మల రమేష్, అంగన్వాడీ నాయకులు పాముల అన్నపూర్ణ, సరియం భవాని, సుహాషిని, నయోమి, ప్రభావతి, ఆర్.వి.రమణ,సౌజన్య, సంగీతారాణి, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై సిబ్బంది చేతివాటం



గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

కనకదుర్గమ్మ కొలువైన విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. హుండీ లెక్కింపులో బంగారం దారి మళ్లించే ప్రయత్నం చేశారు. అసలైన బంగారాన్ని రోల్డ్‌గోల్డ్‌గా మార్చేందుకు యత్నించారు. అనుమానంతో ట్రస్ట్ బోర్డు సభ్యులు తనిఖీలు చేయగా విషయం వెలుగుచూసింది. తనిఖీలో సిబ్బందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.1.25 లక్షల విలువైన బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.నిందితులను విచారించాల్సిగా పోలీసులకు దేవాలయం అధికారులు అప్పగించినట్లు సమాచారం.

GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.